నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 6-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:54 పేజీలు: 4 వెల: రూ.1/-

అటవీ కళాశాలలో ఎమ్మెస్సీ ఫారెస్ట్ కోర్సు

ములుగు అటవీ కళాశాలలో ఎమ్మెస్సీ ఫారెస్ట్ కోర్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను అరణ్య భవన్‌లో విడుదల చేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి. చిత్రంలో అటవీశాఖముఖ్య అధికారి శోభ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): 2020 - 2021 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ అటవీ కళాశాల, పరిశోధన సంస్థలో ఎమ్మెస్సీ ఫారెస్ట్ కోర్స్ ఆన్ లైన్ అడ్మిషన్ల ప్రక్రియను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. అరణ్య భవన్‌లో అడ్మిషన్ బ్రోచర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు.

అటవీ యాజమాన్యంలో విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఎఫ్ సీఆర్ఐ ను ప్రారంభించారన్నారు. కళాశాల ప్రారంభించిన అనతి కాలంలోనే ఇక్కడ చదువుతున్న విద్యార్థులు దేశ, విదేశాల్లోని ప్రఖ్యాత యూనివర్సిటీల్లో సీట్లు సాధించడం గొప్ప విషయమన్నారు. ఫారెస్ట్రీ కోర్స్ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఎఫ్ సీఆర్ఐ కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎఫ్ సీఆర్ఐ డీన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపొందించి విద్యా బోధన కొనసాగిస్తున్నామన్నారు.ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ కోర్సు మొదటి బ్యాచ్ అడ్మిషన్ల ప్రక్రియ అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 18 వరకు కొనసాగుతుందని, అర్హత గల విద్యార్థులు లిలిలి.బిబౌఇసతి.తిని వెబ్ సైట్ లో ఆన్ లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 23 వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 26 నుంచి ఆన్ లైన్‌లో క్లాస్ లు ప్రారంభమవుతాయి తెలిపారు. రెండేండ్ల ఈ కోర్సు లో 5 విభాగాల్లో 24 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి, పీసీసీఎఫ్ ఆర్. శోభ, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి



స్టాక్‌హోం, అక్టోబర్ 5 : ఈ ఏడాది వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతిని సోమవారం మధ్యాహ్నం ప్రకటించారు. హెపటైటిస్ సీ వైరస్ ఆవిష్కరణకుగాను అమెరికాకు చెందిన హార్వే జే ఆల్టర్, చార్లెస్ ఎమ్ రైస్, బ్రిటన్‌కు చెందిన మైఖేల్ హౌఘ్టన్ 2020 నోబెల్ బహుమతిని సంయుక్తంగా గెలుచుకున్నారు. స్టాక్‌హోంలో సోమవారం ఉదయం కరోలినా ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో వీరి పేర్లను నోబెల్ బహుమతి కమిటీ ప్రకటించింది. హెపటైటిస్ సీ వైరస్‌పై పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ దక్కడం వైరల్ వ్యాధులపై కొనసాగుతున్న యుద్ధంలో ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో సిరోసిస్, కాలేయ సంబంధ క్యాన్సర్‌కు కారణమయ్యే ప్రధాన ఆరోగ్య సమస్య అయిన రక్తం ద్వారా కలిగే హెపటైటిస్‌కు వ్యతిరేకంగా పోరాటంలో నిర్ణయాత్మక సహకారం అందించిన ముగ్గురు శాస్త్రవేత్తలు హార్వే జే ఆల్టర్, చార్లెస్ ఎమ్ రైస్, బ్రిటన్‌కు చెందిన మైఖేల్ హౌఘ్టన్ అని నోబెల్ బహుమతి కమిటీ ప్రశంసించింది.

"హార్వే జె ఆల్టర్, మైఖేల్ హౌఘ్టన్, చార్లెస్ ఎమ్ రైస్ సెమినల్ ఆవిష్కరణలు చేశారు. ఇది హెపటైటిస్ సీ వైరస్ అనే వైరస్ యొక్క గుర్తింపునకు దారితీసింది. ఇప్పటివరకు హెపటైటిస్ ఏ, బీ వైరస్‌ల ఆవిష్కరణ క్లిష్టమైన దశలు, రక్తంలో కలిగే హెపటైటిస్ కేసులలో ఎక్కువ భాగం వివరించబడలేదు. హెపటైటిస్ సీ వైరస్ యొక్క ఆవిష్కరణ దీర్ఘకాలిక హెపటైటిస్ కేసులకు కారణాన్ని వెల్లడించింది"అని నోబెల్ కమిటీ తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అంచనాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 70 మిలియన్లకు పైగా హెపటైటిస్ కేసులు నమోదవుతుండగా, ఏటా 4,00,000 మంది మరణిస్తున్నారు. ఈ వ్యాధి దీర్ఘకాలికమైనది, కాలేయంలో మంట, క్యాన్సర్‌కు ప్రధాన కారణంగా పరిశోధకులు పేర్కొంటున్నారు.

విజేతలకు 10 మిలియన్ స్వీడిష్ క్రోనర్లతోపాటు (1,118,000 డాలర్లకు పైగా) బంగారు పతకం ప్రదానం చేస్తారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్యం, శాంతి, ఆర్థిక శాస్త్రాల్లో కూడా నోబెల్ బహుమతులు ప్రదానం చేస్తారు. వీటిని ఈ నెల 12 వ తేదీన ప్రకటించనున్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ అక్షయము నిగ వెలుగొందుచు
పల్లా లోచించగలును ప్రజలమనిషిగా
మల్లా మాపురుషునిగా
హార్వాసా "భజనలాల" వరరతులగానున్ !!

-రాధశ్రీ

(అక్టోబర్ 6 భజనలాల్ జననం...)

సెల్: 9494481210

జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులు.. ఇదరు సైనికుల మృతి

శ్రీనగర్, అక్టోబర్ 5: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. సీఆర్పీఎఫ్‌కు చెందిన వాహనంపై దాడికి తెగబడ్డారు. పాంపోర్ బైపాస్ వద్ద సీఆర్పీఎఫ్‌కు చెందిన రోడ్ ఓపింగ్ పార్టీ (ఆర్ఓపీ)పై కాల్పులు జరిపారు. దీంతో ఐదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లకు గాయాల య్యాయి. వారిని జిల్లా దవాఖానకు తరలించారు. గాయపడ్డ సైనికుల్లో ఇద్దరు మృతి చెందారు. దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకొని.. ఉగ్రవాదుల కోసం తనిఖీలు చేపడుతున్నాయి.ఇదిలా ఉండగా ఇటీవల భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం కాశ్మీర్‌లో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీనగర్‌లోని పాంపోర్ బైపాస్ వద్ద బెటాలియన్‌కు చెందిన రోడ్ ఓపెనింగ్ పార్టీ (ఆర్ఓపీ)పై మధ్యాహ్నం 12.50గంటల ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బలగాలు జమ్మూ కాశ్మీర్ పోలీస్ సిబ్బందితో కలిసి రోడ్డు ఓపెనింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాడుల్లో ఐదుగురు సిబ్బంది గాయపడగా.. వారి దవాఖానకు తరలించగా.. ఇద్దరు సైనికులు వీరమరణం పొందారు.

పోలీస్ ఉన్నతాధికారులతో 7న కెసిఆర్ భేటీ

-శాంతిభద్రతలతో పాటు పలు అంశాలపై చర్చ

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణతో పాటు ఇతర అంశాలపై చర్చించేందుకు ఈనెల 7న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖంరావు విస్తృతస్తాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ప్రగతి భవన్‌లో ఉదయం 11.30గంటలకు జరిగే ఈసమావేశంలో శాంతి భద్రతలు, మహిళల భద్రత, అడవుల సంరక్షణ, కలప స్మగ్లింగ్ అరికట్టడం, గంజాయి తదితర మాదక ద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌చర్చి ంచనున్నారు. అలాగే అవసరమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. హోంశాఖ, అటవీశాఖ మంత్రులు, కార్యదర్శులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, అడిషనల్ డీజీపీలు, ఐజీలు, డిఐజీలు, పోలీస్‌కమిషనర్లు, ఎస్పీలు ఈ సమావేశంలో పాల్గొంటారు.

మిషన్ భగీరథతో మంచినీటి సమస్యలకు చెక్: ఎంపి రాములు

నాగర్‌కర్నూల్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): మిషన్ భగీరథతో మంచినీటి వెతలు తీరాయని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. ఎక్కడా లేనివిధం క్క తెలంగాణలో మాత్రమే ఇవంటింటికీ మంచినీరు అందించే బృహత్తర కార్యక్రమం మిషన్ భగీరథ అన్నారు. జిల్లాలోని కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో రూ.35 కోట్లతో చేపట్టనున్న మిషన్ భగీరథ పనులకు ఎంపీ రాములు భూమి పూజ చేశారు. అలాగే మైనర్ ఇరిగేషన్ భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..మిషన్ భగీరథతో తెలంగాణలో తాగు నీటి కష్టాలు దూరమయ్యాయని తెలిపారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు భరోసా దక్కిందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ పట్టాదార్ పాసు పుస్తకాలను పంపిణీ చేసిన మంత్రి

మహబూబాబాద్, అక్టోబర్ 5: దేశానికి వెన్నెముక అయిన రైతన్నకు వెన్నెముకలా నిలిచిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తొర్రూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో మహబూబాబాద్ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు రూ. కోటికి పైగా విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. 588 మందికి డిజిటల్ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతును రాజు చేయడమే ప్రధాన ధ్యేయంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నదని తెలిపారు. కరోనా కష్టకాలంలో రైతులను ఆదుకున్న ప్రభుత్వం దేశంలో ఉందా? అని మంత్రి ప్రశ్నించారు. నూతన రెవెన్యూ చట్టం వల్ల పేదలకు సరైన న్యాయం జరుగుతుందని ఎర్రబెల్లి తెలిపారు. వ్యవసాయ భూముల్లాగే, వ్యవసాయేతర భూములకు కూడా పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం తలపెట్టిందని, పూర్తి ఉచితంగా ఆన్ లైన్ చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

ప్రజలు తమ భూములకు రక్షణ, హక్కు, భద్రత కల్పిస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. మరికొద్ది రోజుల్లో వస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి గ్రాడ్యువేట్ తన ఓటును నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ నెల 5వ తేదీ నుండి 12వ తేదీ వరకు జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చిన్న పిల్లలకు నట్టల నివారణ మందులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అంటువ్యాధుల నివారణ అధికారిని డాక్టర్ సీతామహాలక్ష్మి, తాసిల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో గౌస్, వైర్ పర్సన్ రామచంద్రయ్య, వైస్ వైర్ పర్సన్ సురేందర్ రెడ్డి, జెట్పీటీసీ శ్రీనివాస్, ఎంపీపీ అంజయ్య డిప్యూటీ డీఎంహెచ్ వో కోటాచలం, గాంధీ నాయక్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో మార్పులకు యత్నం

మరింత పకడ్బందీగా ఆరోగ్యశ్రీ

పేదలకు వైద్యం అందేలా చర్యలు: ఈటెల

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య శ్రీని పకడ్బందీగా అమలు చేస్తామని, ఈ విషయంలో ఎవరూ అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించామని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు ఆరోగ్యశ్రీలో మార్పులు చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లినా ఏ ఒక్కరోగి కూడా వెనక్కి తిరిగి రాకుండా.. ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన పేదలపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా చికిత్స అందిస్తామన్నారు. అందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కరోనా తీవ్రత, కేసులు తగ్గినా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బతుకమ్మ, దసరా పండుగల సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. లేకుంటే కేరళ అనుభవాలను ఎదుర్కోక తప్పదన్నారు. కేరళలో ఓనమ్ వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఒక్కసారిగా కొవిడ్ కేసులు పెరిగాయి. రాష్ట్రంలోనూ బతుకమ్మ, దసరా పెద్ద పండుగలు. ఈ రెండు పండుగల్లో ప్రభుత్వ సూచనలను పాటించాలని ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ సూచనలు పాటించకపోతే కేరళ తరహాలో సమస్యలు వస్తాయన్నారు. గాంధీ ఆస్పత్రి మినహా అన్ని ఆస్పత్రుల్లో అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కొవిడ్ సేవల్లో ఉన్న వైద్య సిబ్బంది మినహా ఇతరులు విధులకు రావాలని ఆదేశించారు.

దేశ వ్యాప్తంగా నులిపురుగుల నివారణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కడుపులో నులి పురుగులు ఉంటే పిల్లల్లో ఎదుగుల ఉండదు. తెలంగాణలో ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి అల్బండజోల్ టా÷-లబెట్స్ వేసే కార్యక్రమం చేపడతామని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు.

జీఎస్టీ పరిహారాన్ని కేంద్రమే చెల్లించాలి : మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 5: కేంద్రమే జీఎస్టీ పరిహారం మొత్తం అప్పు తీసుకుని రాష్ట్రాలకు చెల్లించాలి అని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కోవిడ్ పరిస్థితుల్లో ఈ మొత్తం రాష్ట్రాలకు అత్యంత అవసరం అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన 42వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు. బీఆర్కే భవన్ నుంచి తెలంగాణ తరపున ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. జీఎస్టీ పరిహారం మొత్తం కేంద్రమే చెల్లించాలన్నారు. పరిహారం పోందడం రాష్ట్రాల చట్టబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. ఐజీఎస్టీ కింద రాష్ట్రాలకు రావాల్సిన మొత్తం వెంటనే చెల్లించాలి. ఈ ఏడాది ఆరు నెలల సెస్ వసూలు చేశారు. కేంద్రం రాష్ట్రాలకు చెల్లించాల్సిన మూడు ఇన్‌స్టాల్ మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మొత్తం రాష్ట్రాలకు వెంటనే పంచాలి అని హరీష్ రావు డిమాండ్ చేశారు.

ఐజీఎస్టీ కింద తెలంగాణకు రావాల్సిన రూ.2638 కోట్లు వెంటనే విడుదల చేయాలి అని మంత్రి హరీష్ రావు ఐజీఎస్టీ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సమావేశం అక్టోబర్ 1వ తేదీన జరిగింది. గతంలో ఈ మొత్తాన్ని 25 వేల 58 కోట్లు కన్సాలిడేటెడ్ ఫండ్ లో నిబంధలకు విరుద్ధంగా జమ చేశారన్న విషయాన్ని పార్లమెంట్ లో కాగ్ ఎత్తి చూపిన న విషయాన్ని ఈ సమావేశంలో మంత్రి హరీశ్ రావు ప్రస్తావించారు. కాగ్ సైతం ఈ విషయంలో తప్పు పట్టింది కాబట్టి ఎలాంటి చర్చ లేకుండా రాష్ట్రాలకు ఈ మొత్తాన్ని ఇవ్వాలన్న సిఫారసును గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఈ నెల ఐదో తేదీన జరిగే జీఎస్టీ కౌన్సిల్ ఎజెండాలో ఉండేలా చూడాలని కోరారు.

రైతన్నకు అండగా నిలిచిన కెసిఆర్

రెవెన్యూ చట్టంతో అన్నదాతలకు భరోసా
రైతుబంధు,రుణమాఫీతో తోడుగా నిలిచాం
కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): దేశానికి వెన్నెముక రైతన్నకు అండగా నిలిచిన ఘనత సీఎం కెసిఆర్ గారికే దక్కుతుందని, రైతాంగాన్ని ఆదుకోవడానికి ఏ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రైతును రాజు చేయడమే ప్రధాన ధ్యేయంగా సిఎం కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని తెలిపారు.మహబూబాబాద్ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో సోమవారం, 93 మంది లబ్దిదారులకు రూ. కోటికి పైగా విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. 588 మందికి డిజిటల్ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, రైతాంగానికి సాగునీరు, ఉచితంగా 24 గంటలపాటు నాణ్యమైన కరెంటు, సంవత్సరానికి రెండు పంటలకు గాను ఎకరాకు 10 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సహాయం అందిస్తున్నామని అన్నారు. అలాగే రుణ మాఫీలు, రైతు బీమా, అందుబాటులో విత్తనాలు, ఎరువులు, రైతులకు అందిస్తున్న ప్రభుత్వం దేశంలోనే కాదు, ప్రపంచంలోనే లేదన్నారు. కరోనా కష్టకాలంలో రైతులను ఆదుకున్న ప్రభుత్వం దేశంలో ఉందా? అని మంత్రి ప్రశ్నించారు. రైతుల ఆర్థిక స్థతిని పెంచేందుకే ప్రభుత్వం, సీఎం కెసిఆర్ కృషి చేస్తున్నారన్నారు. రైతుల బాగు కోసం ఎంతకైనా సిద్ధపడిన సిఎం కెసిఆర్ రైతుల ఆత్మబంధువు అన్నారు. నూతన రెవెన్యూ చట్టం వల్ల పేదలకు సరైన న్యాయం జరుగుతుందని సాదా బైనామాలో తీరని చిక్కులన్నీ రెవెన్యూ చట్టం వల్ల తొలగిపోతాయని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. వ్యవసాయ భూముల్లాగే, వ్యవసాయేతర భూములకు కూడా పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం తలపెట్టిందని, పూర్తి ఉచితంగా ఆన్ లైన్ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు తమ భూములకు రక్షణ, హక్కు, భద్రత కల్పిస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంటువ్యాధుల నివారణ అధికారిని డాక్టర్ సీతామహాలక్ష్మి, తాసిల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో గౌస్, వైర్పర్సన్ రామచంద్రయ్య, వైస్ వైర్ పర్సన్ సురేందర్రెడ్డి, జెడ్ పి టి సి శ్రీనివాస్, ఎంపీపీ అంజయ్య డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ ఓ కోటాచలం, గాంధీ నాయక్, సీతారాములు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు సర్పంచులు లబ్దిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు ప్రిన్సిపాళ్లకు ప్రమోషన్లు

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్‌గా పనిచేస్తున్న ఐదుగురికి డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఐఈవో)లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ఆ ఐదుగురిని డీఐఈవోగా నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ జిల్లాకు అబ్దుల్ ఖాలిక్, రంగారెడ్డి జిల్లాకు యెంక్యా, నల్లగొండ జిల్లాకు దస్రూ, వరంగల్ అర్బన్‌కు ఏ గోపాల్, ఖమ్మం జిల్లాకు ఎం కిషన్ నియామకం అయ్యారు.

రైతుల భూములకు రక్షణ కవచం

నూతన రెవన్యూ చట్టంపై ఎంపి బోర్లకుంట

జయశంకర్ భూపాలపల్లి,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రెవెన్యూ చట్టం రైతుల భూములకు రక్షణ కవచంగా ఉంటుందని పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యుడు బోర్లకుంట వెంకటేష్ నేత అన్నారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తూ.. పెద్దపల్లి, భూపాలపల్లి జడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిని రాకేష్‌ల ఆధ్వర్యంలో రైతులతో కాటారం మండలంలోని మద్దులపల్లి నుంచి ఎర్రగుంటపల్లి వరకు 500కు పైగా ట్రాక్టర్లతో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్తేజపరిచారు. కాగా, వేలాదిగా రైతులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఇవ్వగలరా?

నేటినిజం
మంగళవారం 6-10-2020

విద్యాసంస్థలను తిరిగి ప్రారంభించేందుకు కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసినా ..కరోనాకు సంబంధించి ప్రభుత్వాల నిర్లక్ష్యం తల్లిదండ్రులను భయానికి గురి చేస్తోంది. కరోనా కట్టడిలో కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇవాళ ఏ రంగంలో అయినా భయాందోలనలు తొలగిపోయేవి. వ్యాక్సిన్ వచ్చినా,రాకున్నా వ్యాప్తిని అదుపులో పెట్టగలిగేవారము. గత నెలలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో కూడా పాఠశాలలు, విద్యా సంస్థలను తిరిగి తెరిచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకుల అంగీకారంతో నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. అయితే రాష్ట్రాలు స్థానిక అవసరాలకు అనుగుణంగా వారి మార్గదర్శకాలతో ముందుకు రావడానికి కూడా అనుమతి ఇచ్చారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల పునః ప్రారంభంపై మంత్రిత్వశాఖతో సంప్రదింపుల ద్వారా ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకోవచ్చని కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పొక్రియాల్ నిషాంక్ ఇటీవల చెప్పారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ నెల 15 తర్వాత స్కూళ్ల కోచింగ్ ఇనిస్టిట్యూట్లను తిరిగి తెరిచేందుకు సంబంధించి గ్రేడింగ్ పద్ధతిలో నిర్ణయించ వచ్చని ట్వీట్ చేశారు. యూజీసీ తాజా క్యాలెండర్ ప్రకారంగా..ఫ్రెషర్స్ కోసం అకడమిక్ సెషన్ నవంబర్‌లో ప్రారంభం కానుండగా..ఆన్‌లైన్ ద్వారా జరిగే అవకాశం ఉందంటున్నారు. నిజానికి పాఠశాలలు, కళాశాలలు తెరిస్తే వాటిని కోవిడ్ నిబంధన మేరకు శానిటైజ్ చేయడం, కరోనా వ్యాప్తి జరకుండా చూడాలి. అయితే ఇది ఇప్పట్లో సాధ్యమా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇదే క్రమంలో ఆన్‌లైన్ పాఠాలు పేద పిల్లలకు అందడం లేదు. దీనిపై ప్రభుత్వాలు కూడా చేతులెత్తేశాయి. కేవలం ఆన్‌లైన్ పాఠాలు ప్రారంభించామని ప్రకటించి చోద్యం చూస్తున్నారు. అవి పేదలకు అందుతున్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించడం లేదు. ఇప్పటికే వ్యాక్సిన్‌పై పరిశోదనలు పూర్తి కాలేదు. ఎప్పటి వరకు వస్తాయన్నది తెలియదు. వచ్చినా అందిరికీ అందుబాటులోకి వస్తుందా అన్నది కూడా ప్రశ్నే. ఈ దశలో పిల్లలను తరగతి గదులకు పంపాలన్న సాహసం ఏ తల్లిదండ్రులు చేస్తారన్నది కూడా ప్రశ్నగా మారింది. ఈ మహమ్మారిని ఏవిధంగా నిరోధించా లన్న విషయంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలూ మాట్లాడడం మానివే శాయి. దానికి బదులు అమలులో ఉన్న నియంత్రణలను ఏవిధంగా సడలించాలన్న అంశంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. ప్రధానంగా ప్రజారోగ్య వ్యవస్థ ద్వారా నిరోధించవలసిన కరోనా మహమ్మారి నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమవడం కళ్లారా చూస్తున్నాం. మన దేశంలో ప్రజారోగ్య వ్యవస్థ చాలా బలహీనంగా ఉందనడానికి ఇంతకన్నా సాక్ష్యాలు అవసరం లేదు. ఇప్పుడు వస్తున్న నివేదికలను బట్టి చూస్తే కరోనాకు నిరోధకశక్తి శాశ్వతంగా ఉండదని స్పష్టం అవుతోంది. ఈ వైరస్‌కు దేశాల హద్దులంటే ఎటువంటి ఖాతరూ లేదు. దేశదేశాలకూ ఇది విస్తరిస్తూనే వుంది. ప్రపంచం మొత్తం మీద సామూహిక నిరోధకశక్తి వస్తే తప్ప ఈ వైరస్‌ను నిరోధించడం సాధ్యం కాదు. ప్రపంచం మొత్తంమీద అందరికీ వ్యాక్సిన్ అందుబాటులోకి రావడం ఇప్పుడే సాధ్యపడేలా లేదు. మామూలుగా అయితే ఒక వ్యాక్సిన్‌ను రూపొందించి పరీక్షించడానికి 5 నుండి 10 సంవత్సరాలు పడుతుందని పరిశోధకుల, నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ సంవత్సరాంతానికి లేదా వచ్చే ఏడాది ప్రారంభం లోనో వ్యాక్సిన్ తయారీలో విజయం సాధిస్తే అది చాలా గొప్ప విజయమే అవుతుంది. ఇటువంటి అంటువ్యాధులకు వ్యాక్సిన్లను కనుగొనగలిగే శక్తి, శాస్త్రీయ, సాంకేతిక సామర్థ్యమూ మన దేశానికి ఉన్నాయని కూడా రుజువవుతోంది. సంపన్న దేశాలలో సైతం కరోనా విస్తరించి ఒక అత్యవసర పరిస్థితిని సృష్టించడంతో వైద్యశాస్త్రం కరోనా వ్యాక్సిన్ తయారీని అత్యవసర కర్తవ్యంగా స్వీకరించింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 38 వ్యాక్సిన్లు వివిధ ప్రయోగ దశలలో ఉన్నాయి. నిజానికి వీటిని అప్పుడే వ్యాక్సిన్లు అని అనలేము. ఇవిగాక ఇంకో 149 వ్యాక్సిన్లు వివిధ దశలలో తయారవుతున్నాయి. క్యాడిల్లా హెల్త్ కేర్, భారత్ బయోటెక్ అనే రెండు ఇండియన్ కంపెనీలు మొదటి, రెండవ దశల ప్రయోగాలను పూర్తి చేసుకుని మూడవ దశ లోకి అడుగుపెట్టనున్నాయి. ముక్కు ద్వారా ఎక్కించే ఒక వ్యాక్సిన్ తయారీ గురించి అమెరికా లోని వాషింగ్టన్ యూనివర్సిటీతో భారత్ బయోటెక్ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. కరోనా మహమ్మారి ప్రపంచం మొత్తం మీద విస్తరిస్తూ ఒక పెను సవాలును విసిరింది. అయితే చాలా దేశాలు ఈ కరోనా మీద పోరాటంలో చేతులెత్తేశాయి. ఎప్పుడు వ్యాక్సిన్ వస్తుందా, ఎప్పుడు కరోనాను ఆపుతుందా అని ఎదురు చూసే పనిలో పడ్డాయి. ఇప్పటికి మూడు కోట్ల నలభై లక్షల మందికి పైగా కరోనా బారిన పడ్డారు. పది లక్షల మందికి పైగా మరణించారు. గత శతాబ్ద కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇంత దారుణంగా దెబ్బ తిన్నది ఎన్నడూ లేదు. అమెరికా,భారత దేశాల్లో అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. ఈ దశలో కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటూ విద్యా సంస్థలను తెరిచేలా అనుమతించాలి. కరోనాతో సహజీవనం చేస్తూనే జాగ్రత్తలు పాటిస్తే అది మనదరికి చేరకపోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా ఒక్కొక్కటిగా అన్ని రంగాలకు మినహాయింపులు ఇస్తున్నారు. ఇప్పటికే పర్యాటకరంగం తెరుచుకుంది. సినిమాహాళ్లు తెరుచుకో బోతున్నాయి. ఇలా ఒక్కోరంగం ఓపెన్ అవుతున్న వేళ విద్యారంగంపై మాత్రం తగు జాగ్రత్తలు తీసుకో కుంటే భారత్ భవిష్యత్ ప్రమాదంలో పేడ అవకాశాలు మెండుగా ఉన్నాయి. విద్యాసంస్థల్లో కఠినమైన ఆంక్షలతో ముందుకు సాగితే తప్ప చదువులు సాగవు. అందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో ప్రకటించాలి. తల్లిదండ్రులకు ఎలాంటి భరోసా ఇస్తాయో తెలియచేయాలి. అప్పుడే విద్యాసంస్థలకు అనుమతులు ఇవ్వాలి. అప్పుడే విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా దక్కగలదు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి..ఏడుగురు అరెస్ట్

మంచిర్యాలలో రహస్యంగా పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంచిర్యాల, అక్టోబర్ 5 : జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్ లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆకస్మిక దాడి చేశారు. రహస్యంగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 25,860/- రూపాయల నగదు, నాలుగు బైకులు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జాదవ్ రాహుల్ అనే వ్యక్తి ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను పట్టుకున్నారు.

మరో వ్యక్తి పరారీలో ఉన్నారు. జాదవ్ రాహుల్, వినయ్, చంద్రగిరి మహేష్ పటేల్, గుంట ప్రసాద్, కొత్త సంతోష్ పెద్దపల్లి సాయి కృష్ణ, సుధాకర్ ను అరెస్ట్ చేశారు. పారిపోయిన వ్యక్తి అనిల్ బ్యాంక్ ఉద్యోగిగా గుర్తించారు. ఈ దాడిలో రామగుండం టాస్క్ ఫోర్స్ ఎస్ఐ కిరణ్, సిబ్బంది సంపత్ కుమార్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

పట్టభద్ర ఎన్నికల్లో మరోమారు బిజెపిదే విజయం

-నిరుద్యోగులను వంచించిన టిఆర్ఎస్ ప్రభుత్వం

మహబూబ్‌నగర్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోమారు బిజెపి ఇజయం సాధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ అన్నారు. టిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అలాగే నిరుగ్యో పట్టభద్రులు అస్సలు నమ్మరని అన్నారు. జిల్లాలో బిజెపి ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని పట్టభద్రులను పట్టించుకున్న పాపాన పోలేదని చంద్రశేఖర్ అన్నారు. ఆరేళ్లుగా ఒక్క ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. డిగ్రీలు, పీజీలు చేసి ఉద్యోగాల కోసం వేచి చూసిన యువతకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. చదువుకున్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల ముందు చెప్పిన ముఖ్య మంత్రి కేసీఆర్ విస్మరించారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రోడ్డున పడేశారన్నారు. కొవిడ్-19 వల్ల ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్స్‌కు జీతాలులేఏక, వేరే చోట ఉపాధి దొరక్క ఇబ్బం దులు పడుతున్నారన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వనికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులయ్యే టీఆర్ఎస్‌లో చేరికలు

వరంగల్ రూరల్, అక్టోబర్ 5: కాంగ్రెస్ ను వీడి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు టీఆర్ఎస్ లో చేరుతున్నారు. తాజాగా పరకాల మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ బండారి రేణుక, వార్డు మెంబర్లు బొచ్చు తిరుపతి, పసుల దేవేందర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతరం ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులయ్యే పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. టీఆర్ఎస్ లో చేరిన వారికి ఎల్లపుడు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ బొజ్జం రమేష్, రైతు కో ఆర్డినేటర్ నాగుల అశోక్, టీఆర్ఎస్ నేతలు బొల్ల శ్రీనివాస్, దోమల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయి

వరంగల్ రూరల్ , అక్టోబర్ 5: పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎం.ఎం.ఆర్ ఫంక్షన్ హాల్ లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయని పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ ఆంగోత్ అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంవత్సరంపై తర్జనభర్జన

పాఠశాలల ప్రారంభంపై రాష్ట్రాల అనాసక్తి

న్యూఢిల్లీ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఈ నెల 15 తర్వాత పాఠశాలలు, కోచింగ్ సంస్థలను తిరిగి తెరిచేందుకు రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. భారీగా పెరుగుతున్న కొవిడ్ కేసులతో సతమతమవుతున్న చాలా రాష్ట్రాలు పాఠశాలలను తిరిగి తెరిచేందుకు తొందరపడడం లేదని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి.

కేసుల సంఖ్య ఎక్కువవు తుండడంతో కనీసం అక్టోబర్, అవసరమైతే ఆ తర్వాత కూడా మూసే వేయాలని కోరు కుంటున్నట్లు సమాచారం ఇచ్చారని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

ఇప్పటి వరకు ప్రధాన రాష్ట్రాల్లో కేవలం యూపీ మాత్రమే గ్రేడెడ్ పద్ధతిలో విద్యా సంస్థలను తిరిగి తెరిచేందుకు తన ఉద్దేశాన్ని ప్రకటిం చింది. యూపీలో అధికారిక కొవిడ్-19 కేసుల సంఖ్య 4,03,101 చేరగా, ప్రస్తుతం 50, 378 యాక్టివ్ కేసులున్నాయి. దశల వారీగా స్కూళ్లను ప్రారంభించేందుకు యూపీ సర్కారు అనుమతి ఇచ్చింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ బెం గాల్, బీహార్ తదితర వైరస్ తీవ్రత ఎక్కువ ఉన్న రాష్ట్రాలు కొన్ని వారాల వరకు పాఠ శాలలు తిరిగి తెరవకపోవచ్చని సంకేతాలి చ్చాయి. గత నెలలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో కూడా పాఠశాలలు, విద్యా సంస్థలను తిరిగి తెరి చేందుకు తల్లిదండ్రులు, సంరక్షకుల అంగీ కారంతో నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. అయితే రాష్ట్రాలు స్థానిక అవసరాలకు అనుగుణంగా వారి మార్గదర్శకాలతో ముందుకు రావడానికి కూడా అనుమతి ఇచ్చారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల పునఃప్రారంభంపై మంత్రిత్వశాఖతో సంప్రదింపుల ద్వారా ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకోవచ్చని కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పొక్రియాల్ ఇటీవల చెప్పా రు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ నెల 15 తర్వా త స్కూళ్ల కోచింగ్ ఇనిస్టి ట్యూట్లను తిరిగి తెరిచేందుకు సంబంధించి గ్రేడింగ్ పద్ధతిలో నిర్ణయించ వచ్చని ట్వీట్ చేశారు. యూజీసీ తాజా క్యాలెండర్ ప్రకారంగా.. ఫ్రెషర్స్ కోసం అకడమిక్ సెషన్ నవంబర్ లో ప్రార ంభం కానుండగా.. ఆన్‌లైన్ ద్వారా జరిగే అవకాశం ఉంది.

వ్యాక్సిన్ల తయారీలో భారత్‌ది మెరుగైన స్థానం

త్వరగా వ్యాక్సిన్ అన్నది అభూత కల్పనే ఫలితాలు వికటించకుండా ముందుకు సాగాలి

న్యూఢి ల్లీ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): అభివృద్ధి చెందుతున్న దేశాలకన్నా మన దేశంలో వ్యాక్సిన్లను భారీ స్థాయిలో ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్నందున మనం మెరుగైన స్థితిలో ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. పూనే లోని నీరం ఇన్‌స్టిట్యూట్‌లో ప్రయోగదశలో ఉన్న ఆస్ట్రాజెనెకా-ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ గనుక విజయవంతమైతే ఆ వ్యాక్సిన్‌లో ఎక్కువ భాగం మన దేశంలో వినియోగానికే కేటాయించాలన్న ఒప్పందం ఉంది. క్యాడిల్లా, భారత్ బయోటెక్‌లకు కూడా ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగానే ఉంది. ఇక డా॥ రెడ్డీస్ ల్యాబ్స్ 'స్పుత్నిక్ వి' అనే వ్యాక్సిన్ తయారీలో రష్యన్ పరిశోధనా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యాక్సిన్ వివిధ దేశాల్లో మూడో దశ ప్రయోగాల్లో ఉంది. మన దేశంలో కూడా ఇటువంటి పొరపాట్లు జరిగాయి. భారత్ బయోటెక్ కోవాక్సిన్ మీద చేస్తున్న ప్రయోగాల మూడు దశలూ ఆరువారాల లోపు పూర్తి కావాలని, అలాగైతేనే ఆగస్టు 15న విజయం సాధించామన్న ప్రకటనను చేయవచ్చని ఐసిఎంఆర్ డైరక్టర్ జనరల్ గట్టి ఆదేశం ఇచ్చారు. అంత తక్కువ వ్యవధిలో మూడు దశల ప్రయోగాలు ఏవిధంగా పూర్తికాగలవన్నది కూడా ఆలోచించలేని స్థితిలో అధికారులున్నారా అని విమర్శలు వెల్లువెత్తాయి. మూడో దశ ప్రయోగాలు విజయవంతం అయితే మన సమస్యలు తీరిపోయాయని అనుకోలేం. ఆ వ్యాక్సిన్లను కనీసం 400 కోట్లు-500 కోట్లు మందికి అందిస్తేనే సామూహిక నిరోధకశక్తి కల్పించడానికి వీలవుతుంది. అంటే కనీసం 800 కోట్లు-900 కోట్ల డోసుల వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయాలి. ఆ తర్వాత వాటిని ప్రపంచంలో అన్ని కేంద్రాలకూ సరఫరా చేయాలి. ఆ తర్వాతే ప్రజలకు వ్యాక్సినేషన్ చేయడం సాధ్యపడుతుంది. ఈ మహమ్మారి విషయంలో ఘోరంగా విఫలమయ్యాక రాబోయే నవంబరు ఎన్నికల ముందు వ్యాక్సిన్‌ను సాధించామని చెప్పుకోవడానికి ట్రంప్ నానా తంటాలు పడుతున్నారు.

చివరకు ట్రంప్ కూడా కరోనా బారిన పడ్డారు. అమెరికన్ ప్రభుత్వం 1100 కోట్ల డాలర్లను పెట్టుబడిగా పెట్టి త్వరగా వ్యాక్సిన్లను అందుబాటు లోకి తేవాలని చూస్తోంది. ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నా వాటిని ప్రజలలోకి విడుదల చేయడానికి అత్యవసరంగా అనుమతులు ఇవ్వాలని అమెరికన్ డ్రగ్ అధికారులపై ట్రంప్ వత్తిడి తెస్తున్నట్లు అర్థం అవుతోంది. అయితే ఈ వ్యాక్సిన్లలో ఏవీ ఇంతవరకూ వ్యాధిని నియంత్రించ గలవని గాని, కనీసం వ్యాధి వ్యాప్తిని నిరోధించగలవని గాని, తీవ్రతను తగ్గించగలవని గాని ఎటువంటి రుజువునూ చూపలేకపోయాయి. పైగా వీటిలో కొన్ని రెండు విడతలుగా ప్రయోగించవలసినవి. రెండో డోసు ప్రయోగించాక కనీసం రెండు నెలలు ఆగితేగాని వీటి ఫలితాలు తెలియవు. అందుచేత ట్రంప్ కోరుకున్నట్టు నవంబరు 3 ఎన్నికల రోజుకు ముందుగా వ్యాక్సిన్లు అందుబాటులోకి రాగలవని చెప్పడానికి లేదు. ఇప్పటికే అమెరికన్ డ్రగ్ అధికారులు అత్యవసరంగా 'హైడ్రాక్సీ క్లోరోక్విన్' వాడకానికి అనుమతించి ఆ తర్వాత నాలుక కరుచుకున్నారు. అదేవిధంగా కరోనా సోకిన వారు కోలుకోడానికి ప్లాస్మా థెరపీకి అనుమతించారు.

ఆ తర్వాత దానివలన ఉపయోగం పెద్దగా లేదని తేలింది. మళ్ళీ మూడోమారు తొందరపడడానికి వారు సిద్ధంగా లేరు. ఇటువంటి సమయంలో తొందరపడి తగినంతగా పరీక్షలు లేకుండానే వ్యాక్సిన్ల వినియోగానికి గనుక తాము అనుమతులిస్తే అది తమకే ఎదురు తిరుగుతుందని డ్రగ్ అధికారులు జాగ్రత్త పడుతున్నారు.

పైగా ఈ వ్యాక్సిన్లను శీతల స్థితిలోనే రవాణా చేయాల్సి వుంటుంది. అంటే ప్రపంచమంతటికీ శీతలీకరణ స్థితిలో అందించడానికి తగిన ఏర్పాట్లను కూడా చేయాల్సి వుంటుంది. ఇదేమంత తేలిక కాదు. పాత తరహా వ్యాక్సిన్లను 2 నుండి 8 డిగ్రీల సెంటిగ్రేడ్‌లో ఉంచితే సరిపోతుంది. కాని ఈ కొత్త తరహా వ్యాక్సిన్లకు మైనస్ 70 నుండి మైనస్ 80 డిగ్రీల సెంటిగ్రేడ్‌లో ఉంచాలి. అమెరికా వంటి దేశాలకు సైతం ఇది చాలా కష్టసాధ్యమైన పనని అంటున్నారు. ఇంత తక్కువ వ్యవధిలో ఇంత ఎక్కువ మందికి వ్యాక్సినేషన్ చేయడం కూడా మన దేశంలో ఇంతవరకూ లేదు. చాలా విస్తృతంగా నిర్వహించే పోలియో వ్యాక్సినేషన్‌లో కూడా మనం 17 కోట్లకు మించి వ్యాక్సినేషన్ చేయడం లేదు. పైగా రెండు డోసుల్లో ఇచ్చే వ్యాక్సినేషన్ విషయంలో మరో సమస్య కూడా ఉంది. మొదటి డోసు పుచ్చుకున్న వారిని రెండవ డోసు సమయానికి గుర్తించి మళ్ళీ వారికే వ్యాక్సినేట్ చేయడం మన దేశంలో చాలా కష్టమని అంటున్నారు. రష్యా, చైనాలు తమ దేశాల అవసరాల వరకు ద్వైపాక్షిక అవగాహనతో కలిసి వ్యవహరిస్తున్నాయి. వ్యాక్సిన్‌ను తయారు చేయడమనేది ఒక శాస్త్రీయమైన సవాలు మాత్రమే అయితే ప్రయోగాలు విజయవంతం అయినట్టు ఎప్పటికి తేల్చగలమన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

అభివృద్ధి నిరోధకుల వల్లే రహదారి విస్తరణ పనుల జాప్యం

సూర్యాపేట, అక్టోబర్ 5 : అభివృద్ధి నిరోధకుల వల్లే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూర్యాపేట పట్టణ ప్రధాన రహదారి విస్తరణ పనులు జాప్యం అవడానికి కారణం అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, ఇతర అధికారులతో కలిసి మెయిన్ రోడ్ విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులను కలిసిన మంత్రి వారి నుంచి సూచనలను అడిగి తెలుసుకున్నారు. విస్తరణలో భాగంగా పీఎస్సార్ సెంటర్ లో ప్రస్తుతం ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాన్నికొద్దిగా ముందుకు జరిపి సరికొత్త హంగులతో తిరిగి నెలకొల్పేందుకు వ్యాపారులను ఒప్పించారు. రహదారి విస్తరణ పనుల్లో చేపట్టాల్సిన విధానాలపై అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. సూర్యాపేట మెయిన్ రోడ్ విస్తరణ కోసం పట్టణ ప్రజలు మూడు దశాబ్దలుగా ఎదురుచూస్తున్నారన్నారు. 2018 ఎన్నికల హామీలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ తో మాట్లాడి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించాం. వ్యాపారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా విస్తరణ పనులు చేపడితే పట్టణ అభివృద్ధి ఇష్టం లేని ఒకరిద్దరు రాజకీయాలు చేసి కోర్టు స్టే తేవడంతో విస్తరణ పనులు జాప్యం అవుతున్నాయని మంత్రి తెలిపారు.

అభివృద్ధి నిరోధకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రెండు నెలల్లో రహదారి విస్తరణ పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, రాష్ట్ర కార్యదర్శి వైవీ, ఉప్పల ఆనంద్ పాల్గొన్నారు.

విజయవాడ తరహాలో భద్రాద్రిలో నవరాత్రి ఉత్సవాలు

-17 నుంచి 25 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు

భద్రాచలం,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలను 17వతేదీన ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రామాలయ ప్రాంగణంలో కొలువుదీరిన లక్ష్మీతాయారు అమ్మవారు 17నుంచి 25వరకు రోజుకొక అలంకారంలో దర్శనమివ్వనున్నారు. విజయవాడలోని కనకదుర్గ దేవస్థానంలో నిర్వహిస్తున్న మాదిరిగానే భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఏటా శ్రీదేవి శరన్ననవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భద్రాచలంలో నిర్వహించే ఉత్సవాలు పాంచరాత్రగమ శాస్త్రానుసారం వీరలక్ష్మి ఉత్సవాలుగా భక్తరామదాసు కాలం నాటినుంచి నిర్వహిస్తున్నారు. కాలక్రమంలో 1973-74నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో 47వసారి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 26న శ్రీరామాయణ పారాయణ సమాప్తి సందర్భంగా శ్రీరామ మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం దసరా మండపంలో శమీపూజ, శ్రీరామలీలా మహోత్సవం నిర్వహిస్తారు. లక్ష్మీతాయారు అమ్మవారు 17వ తేదీన ఆదిలక్ష్మి అలంకారం, 18న సంతాన లక్ష్మి, 19న గజలక్ష్మి, 20న ధనలక్ష్మి, 21న ధాన్యలక్ష్మి, 22న విజయలక్ష్మి, 23న ఐశ్వర్య లక్ష్మి, 24న వీరలక్ష్మి, 25న మహాలక్ష్మి, 26న విజయదశమి రోజున నిజరూప దర్శనం ఇవ్వనున్నారు. ఈ సమయంలో బాలకాండ , అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరాకాండ, యుద్ధ కాండపారాయణం చేయనున్నారు. అయితే ఈ సారి కరోనా భయం నేపథ్యంలో శ్రీరామలీలా మహోత్సవాన్ని ఎలా నిర్వహించాలనే దానిపై ఆలయ అధికారులు, వైదిక సిబ్బంది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సోమవారం నుంచి ఆర్జిత సేవలు అధికారికంగా ప్రారంభం కానుండటంతో రామలీలా మహోత్సవంపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని దేవస్థానం అధికార వర్గాలు పేర్కొన్నాయి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీలక్ష్మీ అమ్మవారికి ఉదయం 8 నుంచి 9.30 వరకు ప్రతిరోజు అభిషేకం నిర్వహిస్తారు. భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు రూ.100 రుసం నిర్ణయించారు. సామూహిక కుంకుమార్చనకు రూ.500, శ్రీరామాయణ పారాయణానికి రూ.1,000, అమ్మవారికి విశేష అలంకారం రూ.1,000, శాశ్వత ఉభయం రూ.10వేలుగా రుసుం నిర్ణయించారు. భద్రాచలం దేవస్థానంలో సోమవారం నుంచి స్వామి వారికి నిర్వహించే ఆర్జిత సేవల్లో భక్తులను అనుమచారు. కొవిడ్ మార్గదర్శకాల ప్రకారం 50శాతం మంది పాల్గొనేలా టికెట్లను విక్రయిస్తున్నారు. సేవల్లో పాల్గొనే భక్తులు కొవిడ్ మార్గదర్శకాల ప్రకారం మాస్కులు ధరించాలని, శానిటైజరుతో చేతులు శుభ్రం చేసుకొని, థర్మల్ స్కానింగ్ ద్వారా శరీర ఉష్ణోగ్రత పరీక్షించుకున్న తరువాతే ఆలయంలోకి అనుమతించారు.

కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు

-న

దుబ్బాక టిఆర్ఎస్ అభ్యర్థిపై తొలగని ఉత్కంఠ

రామలింగారెడ్డి కుటుంబానికి టిక్కెట్ దక్కేనా

కాంగ్రెస్,బిజెపి అభ్యర్థులు దాదాపు ఖరారైనట్లే

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికలో కాంగ్రెస్,బిజెపి అభ్యర్థులు ఎవరన్నది తేలిపోయింది. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించగా, బిజెపి కూడా దాదాపుగా ప్రకటించినట్లుగానే భావించాలి. ఇక టిఆర్ఎస్ మాత్రమే తమ పార్టీ అభ్యర్థి ఎవర్న దానిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. రామలింగారెడడ్ఇ భార్యకు టిక్కెట్ ఇస్తారా లేదా అన్నదానిపైనా స్పష్టత రావడం లేదు. మరోవైపు చెరుకు ముత్యం రెడ్డి కుటుంబ సభ్యులు కూడా పోటీ పడుతున్నారు. ఈ దశలో మధ్యేమార్గంగా మరో అభ్యర్థిని తెరపైకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ దశలో సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామిరెడ్డి పేరు కూడా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పటికిప్పుడు ఆయన రాజీనామా చేస్తే ఆమోదం పొందడం, అనుమతి లభించడం సాధ్యమేనా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. ఇకపోతే దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థిగా సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి పేరు దాదాపు ఖరారైంది. ఉమ్మడి మెదక్ జిల్లా నేతల సూచన మేరకు నర్సారెడ్డినే అభ్యర్థిగా అధిష్ఠానానికి ప్రతిపాదించాలని పార్టీ ముఖ్యనేతల సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు ఏఐసీసీకి నర్సారెడ్డి పేరును మాత్రమే పంపారు. అధిష్ఠానం ఆమోదం పొందిన మరుక్షణం ఆయన పేరును ప్రకటించనున్నారు. వాస్తవానికి నర్సారెడ్డితో పాటు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డిల పేర్లను కూడా పరిశీలించారు. కానీ, నర్సారెడ్డి అభ్యర్థిత్వానికే ఉమ్మడి మెదక్ జిల్లా ముఖ్యనేతలు ఓటేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మణిక్కం ఠాగూర్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కుసుమ్‌కుమార్, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, గీతారెడ్డి, దుబ్బాక ఉప ఎన్నికల సమన్వయకర్త నగేశ్ ముదిరాజ్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గతంలో నర్సారెడ్డి గజ్వెల్ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇకపోతే దుబ్బాక బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు పేరు పరిశీలనలో ఉందని ఆ పార్టీ నేత,దుబ్బాక ఎన్నికల ఇన్‌ఛార్జ్ జితేందర్ రెడ్డి ప్రకటించారు. జాతీయ నాయకత్వం ఆదేశాలు రాగానే అభ్యర్థిని ప్రకటిస్తామని, దుబ్బాకలో బీజేపీకి ప్రజాదరణ బాగుందని జితేందర్ రెడ్డి తెలిపారు. అయితే బీజేపీ అభ్యర్థిగా తనకే టిక్కెట్ ఖరారవుతుందని భావించిన రఘునందన్‌రావు ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంత్రి హరీష్ రావుకు పోటీగా ఆయన ప్రచరంలో పాల్గొంటున్నారు. 2014, 2018 ఎన్నికల్లో ఆయనే పోటీ చేశారు. ఉప ఎన్నిక అనివార్యమని తెలిసిన వెంటనే స్థానిక బీజేపీ నేతలు ప్రచారం ప్రారంభించారు. కొద్ది రోజులకే రఘునందన్‌రావు కూడా పూర్తిగా ప్రచారంలోకి దిగారు. స్థానికంగా ఇతర నేతలు టికెట్ ఆశిస్తున్నప్పటికీ రఘునందన్‌రావు వైపే పార్టీ అగ్రనాయకత్వం మొగ్గు చూపుతోందని తెలుస్తోంది. మరోవైపు సిటింగ్ స్థానాన్ని మంచి మెజార్టీతో తిరిగి తమ ఖాతాలో వేసుకునేందుకు టీఆర్ఎస్ పక్కా వ్యూహంతో వ్యవహరిస్తోంది. రామలింగారెడ్డి మరణం తర్వాత మంత్రి హరీశ్‌రావు దుబ్బాకలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే టీఆర్ఎస్‌కే ఓట్లేస్తామని పలు గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానాలు చేస్తున్నారు. 50 వేల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని టీఆర్ఎస్ అధిష్ఠానం ముఖ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రామలింగారెడ్డి సతీమణికే అభ్యర్థిగా అవకాశం ఇస్తారని భావిస్తున్నారు. అయితే చెరుకు ముత్యం రెడ్డి కుటుంబం నుంచి ఒత్తిడి వస్తున్నందున అభ్యర్థి ఎవరన్నది కెసిఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

లేవీ బియ్యం కోసం మిల్లర్ల కొత్త ఎత్తులు

-ఇతర రాష్ట్రాల మిల్లుల నుంచి బియ్యం సేకరణ?

మహబూబ్‌నగర్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఉన్న మిల్లుల్లో రోజుకు 1,740 క్వింటాళ్ల వడ్లను బియ్యంగా మార్చే అవకాశం ఉంది. జిల్లాకు చెందిన మిల్లర్లు లేవీ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించడంలో ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని చాలా మంది రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ కింద తీసుకున్న వడ్లను అమ్ముకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. తమిళనాడులో తక్కువ ధరకు దొరికే బాయిల్డ్ రైస్‌ను రోజు పది నుంచి 20 లారీల్లో దిగుమతి చేసుకొని, లేవీగా మారుస్తున్నట్లు కూడా తెలుస్తోంది. మరికొందరు ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల నుంచి, కర్ణాటక రాష్ట్ర రాయచూర్ నుంచి బాయిల్డ్ రైస్‌ను దిగుమతి చేసుకుంటున్నారు. రా రైస్ పెట్టాల్సిన మిల్లర్లు రేషన్ బియ్యాన్ని తీసుకొని రీసైక్లింగ్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల మిల్లర్లకు క్వింటాల్‌పై దాదాపు రూ.3 వేల గిట్టుబాటు అవుతుంది. అలాగే వడ్లను బియ్యంగా మార్చినందుకు మరికొంత సొమ్ముతోపాటు, కరెంటు ఆదా అవుతుంది. ఈ కారణంగానే లేవీ కింద పెట్టాల్సిన బియ్యం కోసం కొందరు రైస్ మిల్లర్లు తటపటాయిస్తున్నారు. కస్టమ్ మిల్లింగ్ కింద తీసుకున్న వడ్లను ముందుగానే ఇతరులకు అమ్ముకోవడంతో, ప్రభుత్వానికి పెట్టాల్సిన బియ్యం కోసం ఇతర రాష్ట్రాలకు పరుగులు తీస్తున్నారు. తమిళనాడు, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లోని మిల్లుల నుంచి బాయిల్డ్ రైస్‌ను తెప్పించుకొని వాటినే లేవీగా మారుస్తున్నారు.

కస్టమ్ మిల్లింగ్ కింద రైస్ మిల్లర్లు ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకున్న వడ్లను బియ్యంగా మార్చి ప్రభుత్వానికి లేవీ రూపంలో ఇవ్వాలి. కానీ, ఈ వడ్లను మిల్లర్లు ముందస్తుగా మిర్యాలగూడ, సూర్యపేట, కర్నూల్ ప్రాంతాల్లోని మిల్లర్లకు అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకున్నారు. అయితే, కస్టమ్ మిల్లింగ్ కింద మిల్లర్లు పెట్టాల్సిన బియ్యం పెట్టకపోవడంతో రాష్ట్ర సీఎస్ నుంచి కలెక్టర్ వరకు సివిల్ సప్లయ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు లేవీ బియ్యం పెట్టాలని మిల్లర్లపై ఒత్తిళ్లు తీసుకొచ్చారు. దీంతో వారు బాయిల్డ్ రైస్ కోసం తమిళనాడు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైస్ మిల్లులోని బియ్యాన్ని కొనుగోలు చేశారు.

బెంగాల్లో మరోమారు తీవ్ర ఉద్రిక్తత

బిజెపి నేతను కాల్చి చంపిన దుండగులు

టిఎంసి పనేనంటూ బిజెపి ఆందోళన

కోలకతా,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్ బీజేపీ ఎంపీ అర్జున్ సింగ్ ముఖ్య అనుచరుడు, బైటాగర్ మునిసిపాలిటీ కౌన్సిలర్ మనీష్ శుక్లా దారుణ హత్యకు గురయ్యారు.

పోలీస్ స్టేషన్ సమీపంలో దుండగులు అతి సమీపంనుంచి అతనిపై కాల్పులు జరిపి హతమార్చారు. ఈ హత్యకు నిరసనగా బీజేపీ మద్దతు దారులు పోలీస్ స్టేషన్ వెలుపల ఆందోళనకు దిగారు. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనతో కోల్‌కతాలో మరోమారు తీవ్ర ఉద్రికత పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులతో సమావేశం అనంతరం ఆదివారం రాత్రి కార్యకర్తలతో మాట్లాడుతుండగానే ముసుగులు ధరించిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు శుక్లాపై అతి సమీపంనుంచి కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడిక్కడే కుప్పకూలి పోయారు. తీవ్రంగా గాయపడిన ఆయన కోల్‌కతాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలొదిలారు. శుక్లాతోపాటు మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి.

దీంతో ఆగ్రహోదగ్రులైన కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై బీజేపీ 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. పరిస్థితి అదుపుతప్పడంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసు ఉన్నతాధికారి మనోజ్ వర్మ పరిస్థితిని చక్కదిద్దారు. తృణమూల్ కాంగ్రెస్ (ఈ దాడికి పాల్పడిందని ఎంపీ అర్జున్ సింగ్ ఆరోపించారు. రాత్రి 7.30 వరకు తనతతో ఉన్నారని, పోలీసుల సమక్షంలోనే శుక్లాపై కాల్పులు జరిగాయని విమర్శించారు. మరోవైపు గవర్నర్ జగదీప్ ధన్‌ఖర్ రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వీరేంద్రను రాజ్ భవన్‌కు పిలిపించారు. మనీష్ తనకు తమ్ముడి లాంటివాడని, బెంగాల్ ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి టీఎంసీ, పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గియా కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. దీనికి సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని పోలీసుల పాత్రను దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ ట్విటర్‌లో ఒక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. అధికార పార్టీ నేరస్థులకు ఆశ్రయం కల్పిస్తోందని మరో సీనియర్ నాయకుడు అరవింద్ మీనన్ ఆరోపించారు. టీఎంసీ కుట్రలతో బహిరంగ హత్యలకు తెగబడుతోందని ట్వీట్ చేశారు. అయితే ప్రతిపక్ష బీజేపీ ఆరోపణలను టీఎంసీ తోసిపుచ్చింది. పార్టీలో అంతర్గత పోరుకు శుక్లా హత్య నిదర్శనమంటూ ఖండించారు. తప్పుడు ఆరోపణలతో టీఎంసీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని టీఎంసీ నేత నిర్మల్ ఘోష్ విమర్శలను తిప్పికొట్టారు. కాగా 2019 లో బీజేపీలో చేరిన మనీష్ శుక్లా ఎంపీ అర్జున్ సింగ్ ప్రధాన అనుచరుడు. శుక్లా బీజేపీలో చేరడానికి ముందు టీఎంసీతో ఉన్నారు. ఇటీవల వరుసగా బిజెపి నేతలను టిఎంసి టార్గెట్ చేస్తోందని మండిపడ్డారు.

తెలంగాణలో చురకుగా ఆస్తుల వివరాలు నమోదు

తాత,ముత్తాత్తల నాటి ఆస్తుల వివరాలు సైతం నమోదు

ఇంటి నంబర్లు లేకున్నా ప్రత్యేకంగా గుర్తించి వివరాల సేకరణ

సేకరణ అధికారులకు ప్రజలు సహకరించాలని వినతి

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఇంటికి వచ్చిన సర్వే అధికారులకు సహకరించి వివరాలను తెలుపాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారులు పేర్కొన్నారు. ప్రజలు తమ ఇంటికి సంబంధించిన వివరాలు అందించాలని, ఇది ప్రజల మేలుకోసం చేస్తున్న పనిగా గుర్తించాలని కోరుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వేకు హాజరై సూచనలు సలహాలిచ్చారు. ఇండ్లలో ఉండే మహిళలు తమ ఇంటి వివరాలను సర్వే అధికారులకు తెలుపాలని వివరాలు ఆన్‌లైన్‌లోనే పొందు పర్చుతామన్నారు. కరెంట్ బిల్, ఇంటి కొలుతలు, ఆధార్ కార్డు, పట్టాపాసుపుస్తకం, జనాభా వివరాలను తెలుపాలన్నారు. ఇంటి వివరాలను ఆన్‌లైన్ చేసి ప్రతి ఒక్క ఇంటి యజమానికి ప్రభుత్వం పానువున్నతకాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు సహకరించాలని కోరారు.

అన్ని గ్రామాల్లో ప్రజలు ఇంటి వివరాలతో పాటు వ్యవసాయేతర భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఇంటింటికీ సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి,అధికారులకు సహకరించాలని అన్నారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ తమ విధిగా ఆధార్‌కార్డు,ఫోన్ నంబర్లతో పాటు ఇండ్లు, ఖాళీ స్థలాలు, నిర్మాణ స్థలాలను చూపించాలన్నారు. గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఎంపీడీవోలు పాల్గొని వివరాల నమోదును పరిశీలిస్తున్నారు. వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు వారివెంటే ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆస్తుల ఆన్‌లైన్ ప్రకియను పకడ్బందీగా నమోదు చేయాలని ఎంపీడీవోలకు ఆదేశాలించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఇళ్లు, ఇతర ఆస్తుల వివరాలను ఈ -ఈపంచాయతీ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. చాలాచోట్ల ఇండ్ల తాత-ముత్తాతలపేర ఉండగా వాటిని వారి వారసులు అనుభవిస్తున్నారు. ప్రస్తుతం అసలు యజమానులు ఆధార్‌కార్డులు, ఇతర వివరాలు అందుబాటులో లేవు. ఇటువంటి ఆస్తులను పోర్టల్‌లో నమోదుచేయడం సాధ్యం కావడంలేదు. ఇటువంటి ఆస్తులను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేసుకొని సర్వే పూర్తయ్యాక వారి వివరాలను నమోదు చేస్తామని అధికారులు చెప్పారు. చాలావరకు ఆస్తులు ఇటువంటివి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తున్నదన్నారు. ఆస్తుల నమోదు పక్రయను ఈనెల 9లోగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఇదిలావుంటే మురికి వాడలు, ఇతర ప్రాంతాల్లో అసెస్‌మెంట్ లేని అంటే ఇంటి నంబర్లు లేనివి ఆస్తులను సైతం ధరణి పోర్టల్ డేటాలో నమోదు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ స్పష్టం చేశారు. వీటిని కొత్త ఆస్తిగా చూపుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం అది ఎలా సంక్రమించిందో వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. అలాగే మ్యుటేషన్లు కాని ఆస్తులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వాటి వివరాలు సేకరించి పూర్తిస్థాయిలో పోర్టల్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ధరణి పోర్టల్‌లో నమోదు కోసం నగరంలోని వ్యవసాయేతర ఆస్తుల నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నది. అన్ని రకాల ఆస్తులనూ నమోదు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. అసెస్‌మెంట్ ఉన్నప్పటికీ మ్యుటేషన్ కాని ఆస్తుల వివరాలను మాత్రం సర్వే పూర్తయిన తరువాతే సేకరిస్తామన్నారు. నగరంలో సర్వేకు సిబ్బంది కొరతలేదని, జోన్లవారీగా ప్రస్తుతం 3500మంది సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నట్లు చెప్పారు. అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా ఆస్తుల వివరాల సేకరణ ముమ్మరంగా కొనసాగుతుందన్నారు. తొలుత సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు ఎదురైనప్పటికీ ప్రస్తుతం అవన్నీ పరిష్కారమయ్యాయని, నగరవ్యాప్తంగా సర్వే ముమ్మరంగా కొనసాగిందని చెప్పారు. నగరంలో ఎన్ని ఆస్తులు ఉన్నాయో అనేది సర్వే పూర్తయ్యాకే తేలుతుందని కమిషనర్ తెలిపారు. జీహెచ్ఎంసీలో అసెస్‌మెంట్ అయిన ఆస్తులు 16లక్షల పైచిలుకు ఉన్నప్పటికీ అసెస్‌మెంట్ కాని ఆస్తులు ఎన్ని ఉన్నాయో తమవద్ద డేటా లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సర్వే ద్వారా ఆస్తుల వివరాలు నమోదవుతాయని, నివేదిక వచ్చిన తరువాతే నగరంలో ఎన్ని ఆస్తులు ఉన్నాయో అనేది తెలుస్తుందన్నారు. చాలా ప్రాంతాల్లో బఫర్‌జోన్లు, చెరువు శిఖం భూములు, నాలా ఆక్రమణలు, మూసీ పరివాహక ప్రాంతం తదితర చోట్ల వేలసంఖ్యలో ఇండ్లు ఉన్నప్పటికీ వారికి అసెస్‌మెంట్లు లేవు. అసెస్‌మెంట్లు ఇస్తే యాజమాన్య హక్కు సమకూరుతుందనే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ అధికారులు వాటికి ఇంటి నంబర్లు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా ధరణి పోర్టల్ నమోదు కోసం అన్ని రకాల ఆస్తుల వివరాలు సేకరిస్తుండడంతో అసలు నగరంలో మొత్తం ఎన్ని ఇండ్లు ఉన్నాయో, అవి ఎలా సంక్రమించాయో, వాటి పరిస్థితి ఏమిటో తెలిసే అవకాశముంది.

ప్రజల మనిషిగా పేరుపొందిన శ్రీనివాస్

నిరంతరం ప్రజలే శ్వాసగా బతికిన నేత

ద్రోణంరాజు మృతితో ప్రజల ఆవేదన

విశాఖపట్టణం,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): తండ్రిక తగ్గ తనయుడిగా ద్రోణంరాజు ఎనివాస్ నిస్వార్థ ప్రజా నాయకుడిగా పేరుతెచ్చుకున్నారు. తండ్రి ద్రోణంరాజు సత్యనారాయణ రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని వచ్చిన ద్రోణం రాజు శ్రీనివాస్ ప్రజల్లో నిత్యం మమేకమై మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన మరణంతో విశాఖ పట్టంణంలో ఎవరిని కదిలించినా బాధను,ఆర్తిని వ్యక్తం చేశారు. సమున్నత విలువలకు చిరునామాగా బతికిన ద్రోణంరాజు శ్రీనివాస్ ఇక లేరన్న చేదు నిజం నగర ప్రజల్లో తీరని వేదనను నింపింది. ప్రజల సమస్యలే ఊపిరిగా బతికారు. ప్రజల మధ్యలో ఉన్నారు. ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చే నేతగా మంచి పేరు సంపాదించారు. ఉత్తరాంధ్ర రాజకీయ చాణక్యుడిగా ద్రోణంరాజు సత్యనారాయణకు మంచి పేరుండేది. ఆయన కుమారుడు వీఎంఆర్డీఏ తొలి చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ కూడా తండ్రిలాగే పేదల పక్షపాతిగా పేరు పంపాదించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పిలిచే శ్రీనివాస లేరన్న విషయంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాన్ ఆదివారం మధ్యాహ్నం కన్నుమూశారు. అందుకే జనం మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. పదవిలో ఉన్నా.. లేకున్నా అందరిలో ఆప్యాయత పంచుతూ అందరి మన్ననలు పొందారు. ప్రజల మనిషిగా సేవలందించిన ద్రోణంరాజు శ్రీనివాస్ విశాఖ వాసుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. విద్యార్థి దశ నుంచే ఎన్నో పదవులు అలంకరించి, ప్రజల తరఫున పోరాటాలు చేసి అందరి ప్రశంసలు పొందారు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చినా.. తనదైన రాజకీయంతో నగర ప్రజల హృదిలో రాజుగా నిలిచారు. ఆయన మరణం.. ఉత్తరాంధ్రకు తీరనిలోటని ప్రముఖులు దిగ్భ్రాంతిత వ్యక్తం చేశారు. తండ్రి వారసత్వంతోపాటు నిబద్ధత గల నాయకుడిగా రాజకీయ విలువల్ని కొనసాగించారు. ద్రోణంరాజు తండ్రి తనయులు అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా) ఆవిర్భావం తర్వాత తొలి చైర్మన్‌గా 1979లో ద్రోణంరాజు సత్యనారాయణ నియమితులయ్యారు. ఆ సమయంలో విశాఖ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. అనంతరం వుడా పరిధి పెరిగి వీఎంఆర్‌డీఏగా రూపాంతరం చెందింది. 5 జిల్లాలకు విస్తరించిన వీఎంఆర్‌డీఏ తొలి చైర్మన్ పదవినిని ద్రోణంరాజు శ్రీనివాస్ నిర్వహించారు. వుడా, వీఎంఆర్‌డీఏ లకు తండ్రీ కొడుకులు తొలి చైర్మన్లుగా నియమితులై రికార్డు సృష్టించారు. ద్రోణంరాజు శ్రీనివాస్‌కు ప్రతి కుటుంబం సుపరిచయమే. కార్యకర్తలనే కాదు.. వార్డు పర్యటనకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి అక్కున చేర్చుకునేవారు. అటువంటి వ్యక్తి దూరం కావడంతో విశాఖ నగర ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. మూడు దశాబ్దాల పాటు ఉత్తరాంధ్ర రాజకీయాన్ని ప్రభావితం చేసిన ద్రోణంరాజు సత్యనారాయణ వారసుడిగా వచ్చిన ద్రోణంరాజు శ్రీనివాస్.. తండ్రికి తగ్గ తనయుడిగా నిరూపించు కున్నారు. ద్రోణంరాజు శ్రీనివాస్ 1961 ఫిబ్రవరి ఒకటిన జన్మించారు. తండ్రిని రాజకీయ గురువుగా భావిస్తూ.. విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించారు. 2001 నుంచి 2006 వరకు విశాఖ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. ఆ సమయంలోనే ఎమ్మెల్యేగా ఉన్న తండ్రి ద్రోణంరాజు సత్యనారాయణ మరణించడంతో 2006లో విశాఖ ఒకటో నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ద్రోణంరాజు శ్రీనివాస్ ప్రభుత్వ విప్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడిగా పనిచేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాంగ్రెస్‌లో అనేక కీలక పదవుల ం చేపట్టారు. తండ్రి సత్యనారాయణకు ఉన్నంత రాజకీయ చతురత, దుందుడుకు స్వభావం శ్రీనివాస్‌కు లేకపోయినా.. ప్రజల నాయకుడిగా మన్నలను పొందారు. గెలిచినా, ఓడిపోయినా.. ప్రజలతో అదే తీరుగా వ్యవహరిస్తూ.. నిస్వార్థంగా సేవలందించారు. ప్రతి నిమిషం అందుబాటులో ఉంటూ ప్రజలకు చేరువయ్యారు. తండ్రి పేరును నిలబెట్టిన వారసుడిగా పేరు సంపాదించుకున్నారు. రెండు మార్లు ఎమ్మెల్యేగా, వివిధ కీలక పదవులు అలంకరించినా.. అవినీతి మరక అంటకుండా.. సేవలందించడం శ్రీనివాస్‌కు పేరు సంపాదించి పెట్టింది.

9.దివంగత కాంగ్రెస్ నేత వెంకటస్వామి జయంతి సందర్భంగా కరీంనగర్‌లో నివాళి అర్పించిన కాంగ్రెస్ నేతలు

ద్రోణంరాజు శ్రీనివాస్‌కు నేతల నివాళి

భారీగా తరలి వచ్చిన నేతలు, ప్రజలు

విశాఖపట్టణం,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): విశాఖ అభివృద్ధిలో ద్రోణంరాజు శ్రీనివాస్ చెరగని ముద్ర వేశారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని వైస్సార్‌సీపీ నేతలు ద్రోణంరాజుకు నివాళి అర్పించారు. తమ అభిమాన నేతను కడసారిగా చూసేందుకు పెద్దఎత్తున నగర ప్రజలు, నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్ నివాసానికి చేరుకున్నారు. ఆయన భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించి కన్నీటి పర్యంతమయ్యారు. ద్రోణంరాజు శ్రీనివాస్ భౌతిక కాయానికి పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు శరగడం చిన్న అప్పలనాయుడు నివాళులు అర్పించారు. విశాఖ అభివృద్ధిలో అవిశ్రాంతంగా పనిచేసిన ద్రోణంరాజు శ్రీనివాస్ లేరన్న బాధ జీర్ణించుకోలేక పోతున్నా అని సీపీఎం నేత నర్సింగ రావు అన్నారు. డాక్టర్స్ కాలనీలో ద్రోణంరాజు శ్రీనివాస్ భౌతిక కాయాన్నినందర్శించి నివాళులు అర్పించారు.

ఉత్తరాంధ్ర రాజకీయ దిగ్గజం దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీనివాస్ రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న ఆయన.. గత నెలవరకు వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా పనిచేశారు. నిష్కళంక నాయకుడిగా, అవినీతి మరకలేని నేతగా పేరు సంపాదించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న శ్రీనివాస్‌కు ఆగస్టు 29న కోవిడ్ పాజిటివ్ రావడంతో నాలుగు రోజులు హోం ఐసొలేషన్‌లో చికిత్స పొందారు. తరువాత నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రిలో చికిత్సతో కరోనా నెగిటివ్ వచ్చినప్పటికీ.. ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఆరోగ్యం క్షీణించింది. వీఎంఆర్డీఏ తొలి చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ హెల్త్‌సిటీలోని పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. ఆయన మరణ వార్త వినగానే అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు ఆరిలోవ, పెందుర్తి, నగరంలో పలు ప్రాంతాల నుంచి అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్ర పటం వద్ద మౌనం మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అమర్‌నాథ్, అదీప్‌రాజ్, పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ నివాళి అర్పించారు. శ్రీనివాస్ ఉత్తరాంధ్ర రాజకీయాల్లో చెరగని ముద్రవేశారు. శ్రీనివాస్‌కు భార్య శశి, కుమార్తె శ్వేత, కుమారుడు శ్రీవాస్తవ ఉన్నారు. ద్రోణంరాజు మృతికి ఏపీ సీఎం జగన్‌తోపాటు పలువురు మంత్రులు, వైఎస్సార్సీపీ నేతలు సంతాపం తెలిపారు. ద్రోణంరాజు మృతిపై విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సంతాప సందేశం తెలిపారు. మంచి రాజనీతిజ్ఞుడిని విశాఖ నగరం కోల్పోయిందని పేర్కొన్నారు. చివరివరకు విలువలతో కూడిన రాజకీయాలతోనే జీవించారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పెద్దపీటవేసే ద్రోణంరాజు కుటుంబంతో విశాఖ శారదాపీఠానికి విడదీయరాని అనుబంధం ఉన్నదన్నారు. వారి కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని రాజశ్యామల అమ్మవారిని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఎల్ఆర్ఎస్‌ను కట్టాల్సిన పనిలేదు
కెసిఆర్ ప్రభుత్వం శాశ్వతం కాదు
పన్నుల పేరుతో ప్రజల రక్తాన్ని పీల్చే పనిలో కెసిఆర్
ఎల్ఆర్ఎస్ పేరుతో డబ్బులు గుంజే యత్నాలు
మండిపడ్డి భట్టి తదితర కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం పన్నుల పేరుతో ప్రజల రక్తాన్ని పీల్చే పనిలో ఉందని కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పేదలు రూపాయి రుపాయి పోగేసి కొన్న ప్లాట్లను ఎల్ఆర్ఎస్ కట్టకపోతే రిజిస్ట్రేషన్ చేయమని బెదిరిస్తున్నారని... ప్రభుత్వం క్రమబద్ధీకరించాలి కానీ ఆస్తుల్లో వాటా కొల్లగొట్టడం సబబు కాదని అన్నారు. ఎల్ఆర్ఎస్ పై ఎవరూ ఆందోళన వద్దని, కేసీఆర్ శాశ్వతం కాదని సోమవారం నాడిక్కడ మీడియతో అన్నారు. ఎన్నికల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం లోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్ డీలింక్ చేస్తామన్నారు. అప్పుల భారం ప్రజలపై ఇప్పుడే మొదలైందన్నారు. 2-3ఏళ్లలో అప్పుల భారం ఎలా ఉంటుందోనని భయంగా ఉందన్నారు. వీలైతే ఎల్ఆర్ఎస్ చెల్లించవద్దన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రజలకు వెసులుబాటు కల్పించేలా ఉండాలన్నారు. పన్నులతో ప్రజలను పీడించే వ్యవస్థ మొదలైందన్నారు. నిజాం కాలంలో పంట కంటే శిస్తు ఎక్కువ వేసేవారన్నారు. తెలంగాణలో మళ్లీ వెట్టి పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. నిరంకుశంగా ప్రజలను పీడించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసినప్పుడు ఫీజు తీసుకున్నది ప్రభుత్వం కదా.. మళ్లీ ఎల్ఆర్ఎస్ ఫీజు ఎందుకు అని ప్రశ్నించారు. తెచ్చిన అప్పులు తీర్చడానికి ప్రజలపై భారం వేస్తోందని భట్టి విక్రమార్క ఆరోపించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని.. ఎవరూ భయపడొద్దని భరోసా ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ కట్టొద్దని.. తాము అధికారంలోకి వచ్చాక అందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రీ రెగ్యులరైజ్ చేస్తామని తెలిపారు. కేసీఆర్ శాశ్వతం కాదని చెప్పారు. ఆస్తుల ఆన్‌లైన్ పేరుతో ప్రభుత్వం కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. గ్రామాల్లో ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎవరూ భయపడొద్దని.. తాము అండగా ఉంటామని... కేసీఆర్ ప్రభుత్వాన్ని దించాలని భట్టి విక్రమార్క తెలిపారు. ఇదిలావుంటే ప్రజలపై భారం వేయడానికే కేసీఆర్ ఆస్తుల సర్వే చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు విమర్శించారు. ప్రజల దగ్గరకు వెళ్లినప్పుడు టీఆర్ఎస్‌కు తిరుగుబాటు తప్పదన్నారు. ఎల్ఆర్ఎస్, ఆస్తుల సర్వేతో ఆదాయం పెంచుకోవాలని చూస్తున్నారన్నారు. దుబ్బాక, జీహెచ్ఎంసీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 131, 135 జీవోలు కూడా ప్రజలను దోచుకోవడానికేనని కాంగ్రెస్ నేత వీహెచ్ పేర్కొన్నారు. కరోనా సమయంలో డబ్బులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని...ఎల్ఆర్ఎస్ కట్టాల్సిన అవసరం లేదని టీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మరోసారి విమర్శలు చేసారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫీజు లేకుండానే ఎల్ఆర్ఎస్ చేస్తుందని హామీ ఇచ్చారు. ఖజానా నింపుకోవడం ప్రజల జీవితాల కోసం ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. అప్పుల పాలై ప్రజలెవరూ ఎల్ఆర్ఎస్ కట్టవద్దని...టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎలా దించాలి, ఆస్తులు ఎలా కాపాడుకోవాలో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. ఎల్ఆర్ఎస్ ఆలోచన ఇప్పుడు కొత్తగా ఎందుకు వచ్చిందని నిలదీశారు. పైసా.. పైసా కూడా పెట్టి ప్లాట్ కొన్న పేదవారి కొంపలు కేసీఆర్ ముంచుతున్నారని..కేసీఆర్ చేసే సర్వే లు ఏవి సంస్కరణల కోసం కాదన్ ÷ర్ అయ్యారు. రైతుబందు పేరుతో ఐదు వేలు ఇచ్చి వెనుక నుంచి లక్ష రూపాయలు కొట్టేస్తున్నారని ఆరోపణలు చేశారు. టీఎన్జీవోల ఎన్నికలొస్తే టిఆర్ఎస్ కోసం మందు బాటిళ్లు పంచుతున్నారని.. వారంతా ఒకసారి ఆలోచించుకోవాలని హితువు జగ్గారెడ్డి పలికారు.

చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలు గుర్తించాం: ఎమ్మెల్యే

జగిత్యాల,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెరువుల దగ్గర ఉన్న ఇళ్ల పట్టాలు చెల్లవంటూ బాంబు పేల్చారు. చెరువుల దగ్గర భవనాలు కట్టుకునేముందు ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. చెరువుల్లో భవనాలు కట్టడంవల్లే వరంగల్ మునిగి పోయి ందన్నారు. బఫర్ జోన్‌లో ప్లాట్లు కొన్నవారికి ఇబ్బందుల్లేవన్నారు. అలాగే ఎవరూ చెరువులను కబ్జా చేయవద్దని సూచించారు. అలా చేస్తే ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. గతంలో చెరువుల రోణకు అనేక చర్యలు తీసుకున్నామని అన్నారు. అయితే కొందరు చెరువు శిఖంలో భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల చెరువుల మనుగడకు ముప్పు ఏర్పడిందన్నారు. ఇలా కట్టడాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

అమరావతి మార్పు నేటినుంచి రోజువారీ విచారణ

అమరావతి,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): రాజధాని మార్పునకు సంబంధించిన కేసులపై ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాకేశ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం నుంచి నుంచి రోజువారీ విచారణ చేయాలని నిర్ణయించింది. రాజధాని మార్పుపై మొత్తం 229 అనుబంధ పిటిషన్లు ఉన్నట్లు తెలిపింది. పిటిషన్లను అంశాల వారీగా విభజించినట్లు హైకోర్టు వెల్లడించింది.

తెలివైన పేద విద్యార్థికి ప్రకాశ్ రాజ్ అండ

ఎంఎస్ చదివేందుకు ఆర్థిక సాయం ప్రకటన

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఎదుటివాళ్లకు సాయం చేయాలనే మంచి హృదయం ఉన్నవాళ్లలో విలక్షణ నటుడు ప్రకాష్‌రాజ్ ఒకరు. ఈ లాక్‌డౌన్ కాలంలో కష్టాల్లో ఉన్నవాళ్లకు తన వంతు సాయం చేస్తూ వస్తున్నారు. వలస కార్మికులకు ఆపన్న హస్తం అందించిన ఆయన, స్కూలు మిస్సవుతున్న పిల్లలకు చదువు చెప్పించే బాధ్యతను కూడా తీసుకున్నారు. అలాగే తెలంగాణలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని తన ఉదాత్త హృదయాన్ని చాటుకున్నారు. తాజాగా ఆయన ఓ బ్రిలియంట్ స్టూడెంట్‌కు మాస్టర్స్ డిగ్రీ చేయడానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని చేయడానికి ముందుకు వచ్చారు. పశ్చిమ గోదావరికి జిల్లాకు చెందిన సిరిచందన స్కూలు నుంచే అత్యుత్తమ ప్రతిభ కనపరుస్తూ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసింది. ఆమెకు మాంచెస్టర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సాల్‌ఫోర్డ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి సీటు వచ్చింది. ఆమెకు తండ్రి లేడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. అక్కడకు వెళ్లడానికి ఆశలు వదిలేసుకున్న ఆమె పాలిట ఆపద్బాంధవుడయ్యారు ప్రకాష్‌రాజ్. ఆమెను మాంచెస్టర్ యూనివర్సిటీలో చదివించడానికి ముందుకు వచ్చారు.

స్విమ్స్ కోవిడ్ ఆసుపత్రిలో కూలిన భవనం

మహిళా ఉద్యోగి దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
తక్షణం విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
మహిళా ఉద్యోగి కుటుంబానికి పది లక్షల సాయం ప్రకటన
సిఎం ఆదేశాలతో చర్యలకు ఉపక్రమించిన మంత్రి ఆళ్లనాని

తిరుపతి/అమరావతి, అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): స్విమ్స్ పద్మావతి కోవిడ్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న పై అంతస్తు గోడ ఒక్క సారిగా కుప్పకూలింది. పై నుంచి దిమ్మలు మీద పడడంతో ఒకరు మృతి చెందగా.. మరోఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన మహిళా రాధిక. ఆమె టీటీడీకి చెందిన సిమ్స్ పద్మావతి కోవిడ్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తోంది.

రెండు నెలల గర్భిణి అయిన రాధిక.. ఘటనా స్థలిలోనే మృతి చెందింది. దీంతో సహచర ఉద్యోగులు కన్నీటిపర్యంతమయ్యారు. రెండేళ్ల క్రితం రాధిక ఇద్దరు పిల్లలు మరణించారని.. ఇప్పుడిలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి స్విమ్స్ శ్రీ పద్మావతి కోవిడ్ హాస్పిటల్ ప్రమాదంలో మృతి చెదిన కుటుంబాన్ని, గాయపడిన కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని తెలిపారు. అదే విధంగా ప్రమాదంలో మృతి చెందిన రాధిక కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించారు. గాయపడిన రాజా, నాగరత్నమ్మలకు ఒక్కొక్కరికి రూ. 2లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఈ ప్రమాదంలో ఒక ఉద్యోగి మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఈ సంఘటన జరిగిన తీరుపై తక్షణమే స్పందించిన మంత్రి.. తిరుపతి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ నుంచి ప్రమాద వివరాలను ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై సీరియస్ అయిన మంత్రి గాయపడిన కరోనా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ వెంగమ్మను ఆదేశించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన ప్రిన్సిపాల్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డితో ఫోన్ మాట్లాడి పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసు న్నారు. ప్రమాదంపై వెనువెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏపీ హెచ్ఎంఐడీసీ ఎండీ చంద్ర శేఖర్‌రెడ్డిని ఆదేశించారు. తిరుపతి స్విమ్స్ మొదటి అంతస్తులో కోవిడ్ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్విమ్స్ డైరెక్టర్లకు సూచించారు. స్విమ్స్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఈ భవనం మొదటి బ్లాక్‌లోకి వస్తున్న సమయంలో కరోనా పేషెంట్లకు గాయాలు అయ్యాయని చెప్పారు. ఆకస్మికంగా పెచ్చులు ఊడి పడటంతో ప్రమాదం జరిగిందని, పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని తెలిపారు. ఈ ప్రమాద ఘటనలో ఎవరైనా బాద్యులు అని తేలితే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్ ఆస్పత్రుల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆళ్ల నాని చెప్పారు.

వడ్డీ మాఫీ నిర్ణయంపై మరో వారం గడువు

వివరాలు సంపూర్ణంగా సమర్పించాలన్న సుప్రీం
మరటోరియం కేసును 13కు వాయిదావేసిన న్యాయస్థానం

న్యూఢిల్లీ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): మారటోరియం సమయంలో రుణాలపై వడ్డీ వసూలు చేయడంపై సుప్రీంకోర్టు చేపట్టిన విచారణ మరో వాయిదా పడింది. ఈ కేసులో ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మార్గదర్శకాలు, నోటిఫికేషన్లు, సర్క్యులర్లను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయడానికి ధర్మాసనం ప్రభుత్వానికి అదనంగా వారం సమయం ఇచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. అయితే, ఇదే సమయంలో.. రియల్ ఎస్టేట్ అసోసియేషన్లు, విద్యుత్ ఉత్పత్తిదారులు లేవనెత్తిన సమస్యలను కూడా పరిశీలించాలని కేంద్రం, ఆర్బీఐని సుప్రీంకోర్టు కోరింది. గత నెల 10వ తేదీన దాఖలు చేసిన అఫిడవిట్‌లో సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలకు సంబంధించి అవసరమైన వివరాలను ఇవ్వలేని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆరు నెలల మారటోరియం సమయంలో చిన్న రుణగ్రహీతలకు వడ్డీని వదులుకునే పథకాన్ని రూపొందించడానికి కేంద్రం సిద్ధమవుతున్న తరుణంలో.. ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వడ్డీలు రూ.5,000-7,000 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. విచారణ సందర్భంగా ప్రభుత్వం ఆమోదం పొందిన కేబినెట్ నోట్‌ను సుప్రీం కోర్టుకు సమర్పించారు.

రుణాల చెల్లింపు విషయంలో చక్రవడ్డీ ఎత్తివేతపై కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక సరైన రీతిలో లేదని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. లాక్‌డౌన్ వేళ రుణాలపై మారిటోరియం విధించిన నేపథ్యంలో ఆ అంశాన్ని సుప్రీం ధర్మాసనం ఇవాళ విచారించింది. విద్యా, గృహ రుణాలు, క్రెడిట్ కార్డు బాకీలు చెల్లింపు విషయంలో చిన్న వ్యాపారులపై చక్రవడ్డీ వసూల్ చేయదలుచుకోలేదని గత శుక్రవారం సుప్రీంకోర్టుతో కేంద్రం వెల్లడించింది. అయితే ఆ నిర్ణయాన్ని అమలు చేసేందుకు .. కేంద్రం కానీ, ఆర్బీఐ కానీ ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదని సుప్రీం తెలిపింది. కామత్ ప్యానెల్‌ను కేంద్ర అంగీకరించింది. ఒకవేళ అంగీకరిస్తే ఆ విషయాన్ని తమ అఫిడవిట్‌లో పొందుపరచాలని కేంద్రానికి సుప్రీం సూచన చేసింది.

దుండగులను కఠినంగా శిక్షించాలి..

- మనీషా వాల్మీకి ఆత్మకు శాంతి చేకూరాలని టి.ఆర్.కె ట్రస్ట్ నివాళులు...

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 5 (నేటినిజం ప్రతినిధి): ఉత్తరప్రదేశ్ లో జరిగిన సంఘటనలో మనీషా వాల్మీకిని నలుగురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడి అతి కిరాతకంగా దాడిచేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని టి ఆర్ కె ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టి.ఆర్.కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ లో ఘటనలో మనీషా వాల్మీకిని అతి దారుణంగా అత్యాచారం చేసి గాయపరిచి చివరికి తన మృతికి కారణమైన నిందితులను వెంటనే శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పేరుతో కెసిఆర్ మోసం

ఎక్కడా నిర్మాణాలు పూర్తి చేయలేదు
కేంద్రం వాటాను పక్కదారి పట్టించారు
ఎన్ని ఇళ్లు కట్టినా కేంద్రం వాటా ఇప్పిస్తాం
లక్ష్మణ్‌తో కలసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కిషన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): డబుల్బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో కెసిఆర్ ప్రభుత్వం విఫలం చెందిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2015లో శంకుస్థాపన చేసిన ఇంటి నిర్మాణాలు పూర్తికాక పోవటం ప్రభుత్వ చేతకానితనమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని లక్షల ఇళ్ళు కట్టినా కేంద్రం వాటాను తీసుకొచ్చే బాధ్యత తనదే అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ళ నిర్మాణంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సోమవారం ఉదయం బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలసి ముషీరాబాద్ నియోజకవర్గంలో జరుగుతోన్న డబుల్ బెడ్రూం ఇళ్ళను కేంద్రమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డిని కలసిన లబ్దిదారులు ఇళ్ళ నిర్మాణంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం టీఆర్ఎస్ డబుల్ బెడ్రూం ఇళ్ళను వాడుకుంటోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ళ కోసం ఇచ్చిన నిధులను పక్కదోవ పట్టించారన్నారు. కేంద్ర నిధులతో ఆంధ్రప్రదేశ్‌లో 7లక్షల ఇండ్లు పూర్తి చేశారని తెలిపారు. హైదరాబాద్‌లో దాదాపు 20లక్షల మందికి పేదలకు ఇండ్లు లేవని.. అందరికీ ఇండ్లు నిర్మిస్తే కేంద్ర ప్రభుత్వం వాటా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. డబుల్ ఇండ్లకు మౌలిక సదుపాయాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం టీఆర్ఎస్ డబుల్ బెడ్రూం ఇళ్ళను వాడుకుంటోందని...కేంద్ర ప్రభుత్వం ఇళ్ళ కోసం ఇచ్చిన నిధులను పక్కదోవ పట్టించారని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో వెయ్యి డబుల్ బెడ్రూం ఇళ్లు కడతామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు. నియోజకవర్గంలో 431 ఇళ్లు మాత్రమే నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్లను ఆశగా చూపి మూడు ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓట్లు వేయించుకుందని విమర్శించారు.

మరోవైపు తమకు ఇస్తామన్న డబుల్ బెడ్రూం ఇళ్ళు వెంటనే తమకు అప్పజెప్పాలంటూ మహిళలు ఆందోళనకు దిగారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలనకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ముషీరాబాద్ నియోజకవర్గం మహిళలు తమ గోడును వెళ్ళబోసు కున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ళను ఇవ్వకపోతే గ్రేటర్ ఎన్నికల్లో ఓట్లు వేసేది లేదని లబ్దిదారులు స్పష్టం చేశారు. మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇస్తామంటున్నాడని.. ఐదేళ్ళుగా డబుల్ బెడ్రూం ఇళ్ళను ఆశ చూపిస్తున్నారని మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇళ్ళ కల నెరవేరకుండానే అనేక మంది లబ్దిదారులు మరణించారని తెలిపారు. కొత్త ఇళ్ళల్లోకి వెళ్లామన్న నమ్మకం కోల్పోయామన్నారు. ఐదేళ్ళుగా తాము కడుతున్న కిరాయిని ప్రభుత్వమే నష్టపరిహారం కింద చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ ఇళ్ళు తమకు అప్పజెప్పకుంటే దర్నాకు దిగుతామని హెచ్చరించారు. డబుల్ బెడ్రూం ఇళ్ళ నిర్మాణంలో నాణ్యత లేదని లబ్దిదారులు విమర్శించారు.

డిజిటల్ అనుసంధాన పర్యావరణ వ్యవస్థ ఓస్టోమేట్స్ జీవితంలో మెరుగుదల - వైద్య నిపుణుల వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 5: శస్త్రచికిత్స చేయించుకున్న రోగుల రోజువారీ జీవన విధానంలో భావోద్వేగపూరితంగా, భౌతికంగా, మానసికంగా పలు మార్పులు వస్తాయి. శస్త్రచికిత్స తర్వాత ప్రతి వ్యక్తి రోజువారీ కార్యకలాపాల్లోనూ మార్పులు అనివార్యం. ప్రత్యేకించి క్యాన్సర్ రోగుల్లో.. పెద్దపేగు, ఇతర పేగు క్యాన్సర్ రోగుల్లో ఇది తప్పనిసరి. పెద్దపేగుకు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలో భాగంగా ఒస్టొమీ శస్త్రచికిత్స చేస్తేనే కోలుకుంటారు. పెద్దపేగు క్యాన్సర్ రోగులకు తరుచుగా ఓస్టోమీ శస్త్రచికిత్సలు అనుసంధానమై ఉంటాయి. ఓస్టోమీ శస్త్రచికిత్స తర్వాత ఆరోగ్య పరిరక్షణ వసతులను అందుబాటులోకి తెచ్చుకోవాలంటే కోలుకున్న రోగులు తమ జీవితంలో దీర్ఘకాల సర్దుబాట్లు చేసుకోవడం తప్పనిసరి. ఈ రోగులు తమ మానసిక ఆరోగ్యంపై తిరుగుబాటు తత్వంతో ఉంటారు. డబ్బు ఖర్చు, ధరించే దుస్తులు, చర్మంపై మంటలు, ఆత్మగౌరవం కాపాడుకునే విషయంతోపాటు సరైన భోజనం చేయడం వంటి అంశాల నుంచి రోగులు బయటపడడంతోపాటు సామాజిక మద్దతు పొందాల్సిన అవసరం ఉంది.

ఒస్టోమీ శస్త్రచికిత్స చేయించుకునే రోగులకు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. శస్త్రచికిత్స ఆవశ్యకతపై అవగాహన లోపం, శస్త్రచికిత్స తర్వాత తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలు, వివిధ రక్షణ చర్యల పట్ల సమాచార లేమి, శస్త్రచికిత్స తర్వాత వచ్చే నొప్పి తగ్గించడానికి సరైన ఓస్టోమీ పౌచింగ్ సిస్టం గురించి రోగులు తెలుసుకోవాలి. ఓస్టోమీ శస్త్రచికిత్సలు చేయించుకున్న తర్వాత రోగులు తమ ఆరోగ్య రక్షణకు సరైన ఉత్పత్తులను వాడటం ద్వారానే కోలుకోగలరని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. రోగులు వాడే వేపర్లను తాము వాడే ప్రతిసారీ కట్ చేయాల్సిన అవసరం లేకుండా మౌల్డబుల్ వేపర్లను అభివృద్ధి చేసే వినూత్న టెక్నాలజీ అందుబాటులో ఉంది. ఇటువంటి వేపర్ల వాడకంతో రోగులు తేలిక పడడానికి మార్గం సుగమం అవుతుంది.

విశ్లేషణాత్మక సాధనాలతో ఆరోగ్య పరిరక్షణ ప్రొవైడర్లు ఏళ్ల తరబడి తమ సేవలను డిజిటలైజ్ చేయడం చాలా కీలకంగా మారింది. ఆస్టోమేట్స్ మెరుగ్గా అర్థం చేసుకునేందుకు వీలుగా, వారి వినియోగానికి అనుకూలంగా ఈ సేవలను అభివృద్ధి చేశారు. పర్యావరణ హిత వ్యవస్థతో అనుసంధానం కావడానికి వెబ్ యాప్స్, ఫోన్ యాప్స్ మార్గాన్ని సృష్టించాయి. ఆరోగ్య పరిరక్షణ నిపుణులతో రోగులు అనుసంధానం కావడానికి ప్రత్యేక వేదిక సృష్టించినప్పుడు డిజిటలైజేషన్ సమగ్ర విధానంగా మారింది. డిజిటల్‌గా అనుసంధానమైన ఓస్టోమీ రోగులకు వారి ఆరోగ్య పరిస్థితి గురించి అర్థం చేసుకునేలా అవగాహన కల్పించడానికి వీలవుతుంది. రోజువారీ జీవిత నిర్వహణకు, వారిలో నమ్మకం పెంపొందించడానికి వెసులుబాటు కలుగుతుంది.న్యూఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్స్ జీఐ అంకాలజీ మరియు సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగం అధిపతి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ దీపక్ గోవిల్ స్పందిస్తూ.. 'ఓస్టోమీ రోగులకు డిజిటల్‌గా అనుసంధానమైన పర్యావరణ వ్యవస్థ ఎంతో ముఖ్యం. సరైన సమాచారం అందజేయడం ద్వారా రోగులకు యాప్స్ లబ్ది చేకూరుస్తాయి. వారిలో ఓస్టోమీ గురించి అవగాహన పెంపొందిస్తాయి. ఎటువంటి అవాంతరాలు లేకుండా వైద్యులతో అనుసంధానం కావడానికి యాప్స్‌లో గల సమాచారం ఉపయోగించ¯వచ్చు. ప్రస్తుతం కరోనా మహమ్మారి కొనసాగుతున్న నేపథ్యంలో రోగులు తమ వైద్యులను కలవడానికి జాప్యం చేసే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో డిజిటల్ వ్యవస్థ రోగులకు ఆరోగ్య పరిరక్షణ సేవలతో అనుసంధానమయ్యే ప్రక్రియను మెరుగుపరిచింది'అని తెలిపారు. రోగుల, ఓస్టోమేట్స్ జీవితాన్ని తేలికపరిచేందుకు సరైన సమయంలో సరైన సమాచారం అందించడం చాలా కీలకం. భారతదేశంలో ఇటువంటి విధానాలు ఇంకా శైశవదశలోనే ఉన్నాయి. రోగుల అనుబంధాలను పైకెత్తి చూపుతూ వారికి రిటెన్షన్ ప్రోగ్రామ్ సృష్టించాల్సి ఉంటుంది. రోగుల సంరక్షకులు ప్రమాణాలతో కూడిన రక్షణ చర్యలు చేప ట్టడం అత్యవసరం. రోగులకు రోజువారీగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు 24 లీ 7 గంటలు సహాయం అందించాలి. డిజిటల్ పరికరాలు ప్రక్రియను తేలిగ్గా అర్థం చేసుకోవడానికి వెసులుబాటుగా ఉంటాయి. శస్త్రచికిత్సల ప్రక్రియ, వాటి అవసరం, కొలొస్టోమీ, ఇలియోస్టోమీ వంటి సర్జరీలకు సంబంధించిన లోతైన సమాచారం తెలుసుకోవడం అవశ్యం. ఈ సమాచారాన్ని తెలిపేందుకు మెడికల్ టెక్నాలజీ కంపెనీల యాప్‌లు గైడెన్స్ అందిస్తాయి.మెడికల్ టెక్నాలజీ పరికరాలను నిరంతరం ఆవిష్కరించడం ప్రస్తుతం అవసరం. రోగుల సమాచారం సేకరించి, వారి ప్రశ్నలకు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇచ్చి, వారి శరీరం, జీవితం గురించి సరైన నిర్ణయం తీసుకునేందుకు వెసులుబాటు కల్పించాలి. డిజిటల్ విప్లవం రోగుల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చింది.

ఎలక్ట్రిక్ విద్యుత్ వాహనాల ఉత్పత్తి ప్రణాళికను వేగవంతం చేసిన రిస్సాలా ఎలక్ట్రిక్ మోటార్స్

హైదరాబాద్, అక్టోబర్, 5: తెలంగాణ రీజియన్ అంతటా డీలర్ నెట్‌వర్క్ విస్తరించేందుకు రిస్సాలా ఈ-మొబిలిటీ విభాగం ఇవోలెట్'''కొత్త రాష్ట్రం తెలంగాణతోపాటు భారత్ క్లీన్ మొబిలిటీ దిశగా పరివర్తన చెందుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిదారులు, పారిశ్రామికవేత్తలు, డీలర్లు, పరిశోధకులు దత్తత తీసుకున్న ఎలక్ట్రిక్ మార్కెట్ పట్ల భారత్ పరిణతితో కూడిన ఆసక్తి కనబరుస్తోంది"

'ఇవోలెట్' ఇండియా రాష్ట్రస్థాయి షోరూమ్ ప్రారంభోత్సవంలో సంస్థ స్వ్యాడ్రన్ లీడర్, డైరెక్టర్ అండ్ సీఈఓ ప్రేరణ చతుర్వేది 'స్థానిక పంపిణీదారులతో కలిసి కేంద్ర ప్రభుత్వ 'మేకిన్ ఇండియా'ను బలోపేతం చేయడంలో 'ఇవోలెట్' ఇండియా గణనీయ పాత్ర పోషిస్తూనే తెలంగాణ రీజియన్‌లో రంగ ప్రవేశం చేసింది. అన్ని రకాల ప్రయాణికులు.. యువకుల నుంచి పెద్దల వరకు, యూత్ ట్రెండీ కొనుగోలుదారులు, బిజీ బిజినెస్ పనులు చేసే వారికి సూటైన అన్ని రకాల విద్యుత్ వాహనాలతో ప్రజల ప్రయాణ విధానంలో మార్పులు తీసుకొస్తోంది'. గుర్‌గ్రామ్ కేంద్రం